క్లుప్తంగా

ఇంట్లోనూ చదివించాలి

కోవూరు : పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద కూడా చదివించేలా చొరవ తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధారాణి కోరారు. మండలంలోని ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఉన్నత ఫలితాల కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ, విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ వెంకమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోసగాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): స్థలం తనదంటూ విక్రయానికి పెట్టి అడ్వాన్స్ కింద నగదును తీసుకొని మోసగించిన వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. విజయవాడకు చెందిన రమేష్ ఓ ప్రైవేట్ సంస్థ.. దాని అనుబంధ సంస్థకు న్యాయసలహాదారుడిగా పనిచేస్తున్నారు. కంపెనీకి స్థలాలను కొనుగోలు చేస్తుంటారు. స్థలాల కోసం ఇద్దరు మధ్యవర్తుల ద్వారా సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ నగర్‌లో నివాసం ఉంటున్న చినవెంగళ్‌రెడ్డిని సంస్థ ప్రతినిధులు గతేడాది సెప్టెంబర్‌లో కలిశారు. తనది సొంతి ల్లని.. దుత్తలూరు మండలం జంగాలపల్లిలో 80 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేసి స్వాధీన అగ్రిమెంట్ చేసుకున్నాని ఆయన తెలిపారు. సదరు పొలాన్ని కంపెనీ కొనుగోలు చేస్తే విక్రయదారులతో రిజిస్టర్ చేయిస్తానని వారిని వెంగళ్‌రెడ్డి నమ్మించారు. దీంతో కంపెనీ రూ.20 లక్షలను చినవెంగళ్‌రెడ్డికి బదిలీ చేసింది. నిర్ణీత గడువులోపు పొలాన్ని రిజిస్టర్ చేయించకపోవడంతో కంపెనీ ప్రతినిధులు నిలదీశారు. సమాధానాన్ని దాటేయడంతో జంగాలపల్లిలో విచారణ చేపట్టారు. అతని స్వాధీనంలో ఏ స్థలమూ లేదని.. అతను చూపించిన స్థలం మరొకరిదని తేలింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): బాలిక అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌జీనగర్‌లో నివాసం ఉంటున్న నాగమణి తన కుమార్తెతో కలిసి సమీపంలోని ఇళ్లలో పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. గత నెల 27న పనులకు తల్లీకుమార్తె వెళ్లారు. కొద్దిసేపటి అనంతరం బాలిక తాను ఇంటికెళ్తున్నానని, తెలిసిన వారి పెళ్లికెళ్లొస్తానని చెప్పి బయల్దేరారు. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

డీపీఓలో ఎస్పీ పరిశీలన

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీస్ కార్యాలయంలోని కంప్యూటర్ ల్యాబ్, వివిధ విభాగాలను ఎస్పీ విజయారావు బుధవారం పరిశీలించారు. మినిస్టీరియల్ స్టాఫ్, డీసీఆర్బీకి కంప్యూటర్స్‌పై శిక్షణ తరగతుల నిర్వహణ, తదితరాలపై పోలీస్ అధికారులతో చర్చించారు. ఏఎస్పీ హిమవతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై ముగిసిన శిక్షణ

నెల్లూరు (టౌన్): ఇంటర్న్‌షిప్, ఎల్ఎమ్మెస్‌పై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌పై రామ్‌ప్రసాద్, త్రినాథ్ అవగాహన కల్పించారు. అధ్యాపకులు రజని, నాగమనీషా, మణి, నరేంద్ర, ప్రిన్సిపల్ గిరి, ఎన్నార్సీ కోఆర్డినేటర్ రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసులకు జియో ట్యాగింగ్



మాట్లాడుతున్న బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ సర్వీసులను జియో ట్యాగింగ్ చేయాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) బాబు ఆదేశించారు. నగరంలోని నెల్లూరు టౌన్ – 1 విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేసిన అనంతరం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జియో ట్యాగింగ్ ద్వారా సర్వీసులు ఏ ప్రాంతంలో ఉన్నాయో స్పష్టంగా తెలుసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. ఐఆర్డీఏ బిల్లింగ్‌ను కచ్చితంగా తీసి వినియోగదారులకు ఇవ్వాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన ఇవ్వాలని చెప్పారు. నెల్లూరు టౌన్ డివిజన్ బిల్లుల వసూళ్లలో ముందంజలో ఉన్న నేపథ్యంలో అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్నివర్గాల్లో ఆనందం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఎర్రగుంటలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజల్లో ఆనందం నెలకొందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రగుంట, సరస్వతీనగర్‌లో బుధవారం మంత్రి కాకాణి పర్యటించి, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మంత్రి కాకాణికి ప్రతి నివాసం వద్ద పూలు, కర్పూర హారతులతో ఘన స్వాగతం పలికారు. సీఎం జగనన్న పాలనలో ఎన్నడూ లేని విధంగా తాము సంతృప్తికరంగా ఉన్నామని చెప్పారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రజలు చాలా సంతృప్తికరంగా ఉన్నారని తెలియజేశారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేయడంతో ప్రతి కుటుంబంలోనూ లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటుగా, గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేయించినట్లు వివరించారు.

చంద్రబాబు రావాలని ఎవరూ కోరుకోరు

అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రజలను అన్నివిధాలా మోసం చేసిన మోసగాడు చంద్రబాబు రావాలని ఎవరూ కోరుకోరని మంత్రి కాకాణి తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతుల, మహిళల రుణమాఫీ చేస్తానని నమ్మించి మోసం చేసిన చంద్రబాబును ప్రజలు ఎప్పటికీ నమ్మరని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరుగుతుందని ఒకసారి, తాను అధికారంలోకి వస్తే ఈ పథకాలను తానూ కొనసాగిస్తానని మరొకసారి చెప్పడం చంద్రబాబు రెండు నాల్కల ధోరణికి అద్దం పడుతుందని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నింటినీ ఎత్తివేసే ఆలోచన చేస్తాడే తప్ప ప్రజలకు మేలు చేసే ఆలోచన చేయడనే విషయం ప్రజలకు తెలుసు అని వివరించారు. ఎర్రగుంట, సరస్వతీనగర్‌లను కలిపి ఒక పంచాయతీగా చేయాలని ఆలోచన చేస్తే కొందరు తమ పెత్తందారీతనానికి అవకాశం ఉండదనే కుట్రతో కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని చెప్పారు. త్వరలో సరస్వతీనగర్ ప్రత్యేక పంచాయతీ కాబోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుస్మిత, ఎంపీపీ మందా కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నాయకులు తాటిపర్తి సురేష్, హరిబాబు, కట్టంరెడ్డి విజయకుమార్‌రెడ్డి, వెలిబోయిన వెంకటేశ్వర్లు, షాజహాన్, చీకుర్తి నరసయ్య, మురళీ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో పాటూరు విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోవూరు : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడలో పాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని పాఠశాల హెచ్ఎం గణపర్తి వెంకటేశ్వరనాయుడు అన్నారు. మండలంలోని పాటూరు జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బుధవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో జరిగిన అండర్–14, 17 బాల బాలికల ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో కె.రోహిత్ జట్టు గోల్డ్ మెడల్, వ్యక్తిగత ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. అలాగే అండర్– 17 విభాగంలో వినయ్ కుమార్, ఎం.తనోజ్‌కుమార్, షేక్.షోయబ్, నాగరాజు, అపర్ణ, అలేఖ్య మెడల్ సాధించారన్నారు. వీరిని ఫిజికల్ డైరెక్టర్ భీమతాటి వెంకటరమణయ్య ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ సయ్యద్ జుల్ఫికర్ అలీ అహమ్మద్, జనార్దన్‌రెడ్డి, రమేష్‌బాబు, చంద్రమోహన్, వెంకటరమణయ్య, వల్లి బాషా, భాగ్యలక్ష్మి, ఉమామహేశ్వరి, విజయలక్ష్మి, కిష్టమ్మ, ఎస్.రవిశంకర్, శీనమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయ ఈఓగా వెంకటసుబ్బయ్య



నూతన ఈఓ వెంకటసుబ్బయ్యకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయ కార్యనిర్వహణాధికారిగా జోలు వెంకటసుబ్బయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పెంచలకోన ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు జొన్నవాడ ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. పాలక మండలి చైర్మన్, సభ్యులతో కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జొన్నవాడ ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈఓకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు మహాలక్ష్మీపురం గ్రామంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు జరిగాయి. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అలాగే ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి బుధవారంతో 20 సంవత్సరాలు పూర్తయింది. ఈ నేపథ్యంలో భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమన్వయంతో పంట నమోదును పూర్తి చేయాలి

- ఏడీఏ డి.సుజాత




దామేగుంటలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ సుజాత

కొడవలూరు : వ్యవసాయ శాఖ వీఏఏలు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పంట నమోదును వంద శాతం పూర్తి చేయాలని కోవూరు ఏడీఏ డి.సుజాత సూచించారు. మండలంలోని తలమంచి, దామేగుంట, గుండాలమ్మపాళెం, కొడవలూరుల్లో బుధవారం ఆమె పర్యటించి పంట నమోదుకు సంబంధించిన సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పంట నమోదు మందకొడిగా ఉందన్నారు. రైతులు ఆసక్తి చూపకపోవడం వల్లే పంట నమోదు మందగిస్తోందన్నారు. పంట నమోదు ఆవశ్యమైనందున రైతులు పంట నమోదుకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. పంట నమోదైన రైతులు విధిగా ఈ–కేవైసీ చేయించాలన్నారు. రైతులు కోత సమయం వరకు వేచి ఉండకుండా తీరిక చేసుకుని పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఏడీఏ వెంట ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి, వీఏఏలు ఎన్.ప్రసాద్, బి.లిఖిత, కె.విష్ణుప్రియ, జి.కవిత తదితరులు ఉన్నారు.

పురుగు మందు దుకాణాల తనిఖీ

- పలు ఉత్పత్తుల విక్రయాలు నిలిపివేత



తలమంచిలోని దుకాణంలో పలు ఉత్పత్తుల విక్రయాలను నిలిపేస్తూ ఆదేశాలిస్తున్న ఏడీఏ

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం, తలమంచిలో ఉన్న పురుగు మందుల దుకాణాలను కోవూరు ఏడీఏ డి.సుజాత బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫారం ఓ, పీసీలు లేని పలు ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేస్తూ ఆదేశాలిచ్చారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేయడంతో పాటు రసీదు విధిగా పొందాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన, గుర్తింపు పొందిన ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని చెప్పారు. అలా చేసినప్పుడు ఉత్పత్తుల్లో లోపాలుంటే వ్యవసాయశాఖ చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దుకాణదారులు కూడా ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఏడీఏ వెంట ఏఓ లక్ష్మి ఉన్నారు.

నేడు ఇడిమేపల్లిలో 'గడప గడపకు..'

వెంకటాచలం : మండలంలోని ఇడిమేపల్లిలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకుంటారన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

- సైకాలజిస్ట్ కృష్ణ గల్లా



విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలిస్తున్న కృష్ణ గల్లా

కొడవలూరు : ధృడమైన లక్ష్యంతో ఇష్టంగా చదవడం ద్వారా ఐఐటీలో ప్రవేశం పొందడానికి అవకాశం ఉంటుందని సైకాలజిస్ట్ కృష్ణ గల్లా సూచించారు. మండలలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఐఐటీపై విద్యార్థులు, తల్లిదండ్రులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఐఐటీ పట్ల విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబు నాయుడు, డైరెక్టర్ పి.కృష్ణ చైతన్య, వైస్ ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, హెచ్ఓడీలు రవికుమార్, సుప్రజ పాల్గొన్నారు.

12న మెగా రక్తదాన శిబిరం

కోవూరు : మండలంలోని ఇనమడుగు గ్రామంలో ఈనెల 12వ తేదీన రెడ్‌క్రాస్, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యుడు గునపాటి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇనమడుగు గ్రామంలో బుధవారం వారు మాట్లాడారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు అర్హులన్నారు. రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్రీనివాసులు, మురళీ పాల్గొన్నారు.

పని ప్రదేశంలో ఫొటోలు తీయాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీడీ మృదుల

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : ఉపాధి హామీ పథకం కింద పనులు జరిగే ప్రాంతంలో కూలీలతో సహా రోజుకు రెండు సార్లు ఫొటోలు తీయాలని కావలి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ మృదుల అన్నారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం, పార్లపల్లి, విడవలూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం విడవలూరులోని కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనికి వచ్చే కూలీలను ఉదయం ఒకసారి ఫొటో తీయడంతో పాటు మరో నాలుగు గంటల తరువాత రెండో సారి కూడా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. అలాగే ముందుగానే పనులను గుర్తించడంతో పాటు కూలీలకు అవసరమైన పని దినాలను కల్పించాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈమె వెంట ఈసీ సోఫియా ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



బుచ్చిరెడ్డిపాళెం : లక్ష తులసీ అర్చనలో పాల్గొన్న మహిళా భక్తులు



మనుబోలు : సామూహిక తులసీదళార్చనలో భక్తులు

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలోని విష్ణాలయంలో భీష్మ ఏకాదశిని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అర్చకుడు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవునికి పంచామృతాభిషేకం గావించి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామి దంపతులకు సహస్రనామ తులసీ దళ పూజను సామూహికంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెనుగొండ సుధాకర్–శాంత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఘనంగా లక్ష తులసీ అర్చన

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని లక్ష్మీనరసింహ స్వామికి మహిళా భక్తులు లక్ష తులసీ అర్చనను ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం లక్ష తులసీ అర్చన కార్యక్రమాన్ని గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మాల్యాద్రి–కాంతమ్మ, కృష్ణమోహన్ రెడ్డి–ప్రతిమ, ఆంజనేయులు–జమయ్య, విజయ భాస్కర్‌రెడ్డి–సరోజనమ్మ, పెంచలప్రసాద్–కామేశ్వరమ్మ వ్యవహరించారు. ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు : భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలోని గండవరంలో ఉన్న గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరుని ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ దేవాలయంగా ఉన్న ఉదయకళేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి అత్యంత వైభవంగా జరుగనున్నాయన్నారు. 18, 19, 20వ తేదీల్లో భక్తులు వేలాదిగా తరలి వచ్చే అవకాశం ఉండడంతో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. అలాగే గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి దెబ్బతిన్న విషయాన్ని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా భక్తుల సౌకర్యార్థం రోడ్డు పూర్తిస్థాయి మరమ్మతులకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈనెల 8వ తేదీలోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ బి.వెంకయ్యానాయుడు, తహసీల్దార్, ఎంపీడీఓలు రమాదేవి, సుబ్రహ్మణ్యం, ఏఈలు ఎ.రమేష్, ఎం.రాములు, సీఐ రామారావు, ఆలయ ఈఓ బి.శాంతయ్య, ఎంపీటీసీ సభ్యుడు పి.శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆర్.రాజేష్‌రెడ్డి, ఎం.రంగారెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో ప్రాణాలకు హాని

- సెబ్ సీఐ బాలకృష్ణ



మాట్లాడుతున్న సెబ్ సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ప్రాణాలకు హాని తప్పదని సెబ్ సీఐ బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పిడతాపోలూరు వద్ద ఉన్న రత్నం ఫార్మసీ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, క్రమశిక్షణతో ఉన్నత చదువులు అభ్యసించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని చెప్పారు. అంతేకాని చెడు వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మున్నా, మేనేజర్ ఎ.సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం నిర్వహణ



వేలంపాటలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జొన్నవాడలోని ఏపీ టూరిజం అతిథి గృహంలో బుధవారం బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ మే నెలలో జరిగే ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి వివిధ అంశాలకు ఈ–టెండర్లు, షీల్డ్ టెండర్లు, బహిరంగ వేలంపాటలను నిర్వహించామన్నారు. వేలంలో తలనీలాలకు సంబంధించి శ్రీను అనే వ్యక్తి రూ.16,35,000లకు హక్కును దక్కించుకోగా మిగిలినవి వాయిదా పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, దేవదాయశాఖ కోవూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పండగ



పల్లిపాళెంలో వృద్ధురాలు లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేఖ



పింఛన్ నగదును అందజేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు అందించే నెలవారి పింఛన్లను బుధవారం వలంటీర్లు లబ్ధిదారులకు అందజేశారు. దీంతో గ్రామాల్లో పింఛన్ల పండగ నెలకొంది. బుచ్చిరెడ్డిపాళెంలోని 13వ వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పింఛన్లను అందజేసింది. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు ఉదయం 5 గంటల నుంచే పింఛన్లను పంపిణీ చేశారు.